

రాయలసీమను సస్యశామలంగా చేసేందుకు
నా చివరి శ్వాస వరకూ పోరాడతాను.
- కల్లూరి సుబ్బారావు


# జనస్వరం

అక్షరమే ఆయుధం ✍

www. Janaswaram.com



**పాఠకులకు విజ్ఞప్తి :**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రికలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పబ్లిసిటీ కొరకు అడ్వర్టయిజ్మెంట్ జన్మదిన శుభాకాంక్షలతో పాటు మరియు ఇతర అన్ని రకముల కార్య క్రమాలతో వగైరా ప్రకటనలు ఇవ్వండి. మరిన్ని వివరములకు మా మెయిల్ ఐడి janaswaramnews@gmail.com కు సంప్రదించండి.



సంపుటి : 01 | సంచిక : 19 | ఎడిటర్ : నరేష్ సాకే | వారసంచిక ( 15-11-2020 ) | పేజీలు : 5

/ janaswaramNEWS / 9642067900


## జగ్గంపేట నియోజకవర్గంలో జనసేన ఇంచార్జ్ పాటంశెట్టి సూర్యచంద్ర ఆధ్వర్యంలో గ్రామ కమిటీల నియామకం



జగ్గంపేట ( జనస్వరం ) : జగ్గంపేట నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ పాటంశెట్టి సూర్యచంద్ర గారు మండల కమిటీల ఆధ్వర్యంలో ఇప్పటి వరకూ 15 గ్రామాలలో గ్రామ కమిటీలు వేశారు. అలాగే జనసైనికులందరితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులకు జనసేన సిద్ధాంతాలను వివరిస్తూ వాటిని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలో వివరించారు. అలాగే వచ్చే స్థానిక ఎన్నికలను ప్రస్తావిస్తూ గ్రామాల్లో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు.

## జనసేన పార్టీలోకి జాయిన్ అయ్యిన రెల్లి యువకులు, వీర మహిళలు



విశాఖపట్నం ( జనస్వరం ) : జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి సిద్ధాంతాలకు ప్రభావితమైవైసీపీ, టీడీపీని వీడిన రెల్లియువకులు, వీరమహిళలు. పార్టీ ప్రధాన కార్యదర్శి తమ్మినేని శివశంకర రావు గారి ఆధ్వర్యంలో జనసేన పార్టీలోకి జాయిన్ అయ్యారు. ఈ కార్యక్రమం విశాఖ దక్షిణం శివప్రసాద్, రవి, 37వార్డు అభ్యర్థి ఎర్రంశెట్టిసురేష్ ఆధ్వర్యంలో జరిగింది. శివశంకర రావు మాట్లాడుతూ పార్టీని, ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కోరారు.

# ప్రజల కోసం బలంగా మన గొంతు వినిపించండి...



న్యూస్ ( జనస్వరం ) : ధైర్యంగా గళమెత్తి పోరాటం చేయడం అనేది తెలంగాణ ప్రజల్లో ఉంది... మన చుట్టూ ఉన్న సమస్యలపై ప్రభావశీలంగా మాట్లాడాలి అని జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు చెప్పారు. యువకులు, విద్యార్థులు రాజకీయ చైతన్యంతో ముందుకు వెళ్ళి ప్రజలకు అండగా ఉండాలి అన్నారు. జనసేన పార్టీ తెలంగాణ విభాగం ఇటీవల నియమించిన విద్యార్థి, యువజన కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులతో శ్రీ పవన్ కళ్యాణ్ గారు బుధవారం మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీ వి.వి.రామారావు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు శ్రీ టి.సంపత్ నాయక్, యువజన విభాగం అధ్యక్షుడు శ్రీ వి.లక్ష్మణ్ గౌడ్, ఈ కమిటీల సభ్యులకు, సాంస్కృతిక విభాగం కార్యదర్శి శ్రీ దుంపటి శ్రీనివాస్ కు నియామక పత్రాలు అందించారు.

అనంతరం శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "మన చుట్టూ ఉన్న ప్రజల కోసం బలంగా నిలబడి గొంతు, ( మిగతా 3 లో )

## గ్రామస్థాయిలో జనసేన బలోపేతం లక్ష్యం : బండారు శ్రీనివాస్



తూర్పు గోదావరి ( జనస్వరం ) : తూర్పు గోదావరి జిల్లా ఆలమూరు మండల పరిధిలో, సూర్యారావు పేట గ్రామంలో శెట్టిబలిజ కళ్యాణ మండపం ప్రాంగణంలో ప్రతి గ్రామానికి జనసేన కమిటీ సభ్యులను నియమించి వారికి అభినందనలు తెలిపారు కొత్తపేట నియోజకవర్గ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ గారు. అలాగే 50 మంది యువకులు జనసేన పార్టీలోకి చేరారు. జనసేన పార్టీ సేవా కార్యక్రమాల పట్ల, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పట్ల విధేయత తెలుపుతూ, జనసేన పార్టీ అడుగుజాడల్లో నడుస్తామని అన్నారు ఆ యువకులు. కష్టసుఖాల్లో ముందుకు వచ్చే జన సైనికులకు, గల్ఫ్ జన సైనికులకు, నియోజకవర్గ నాయకులకు, అనునిత్యము వారి సూచనలు సలహాలతో, పార్టీని ముందుకు తీసుకు వెళ్తామని, లాక్ డౌన్ లోనూ కరోనా సమయంలోనూ, నిత్యావసర వస్తువులు, ఆహార ప్యాకెట్లు, శానిటైజర్ వస్తువులు ఆక్సిజన్, రక్తదానం ఇచ్చి ప్రాణాలు నిలబడుతున్న జనసైనికులకు, వందనాలు తెలియజేసారు.

## అగ్ని ప్రమాదంలో పూరి గుడిసె దగ్ధం, ఆదుకొన్న ఎచ్చర్ల జనసేన వీరమహిళ శ్రీ కాంతి శ్రీ గారు



ఎచ్చర్ల ( జనస్వరం ) : ఎచ్చెర్ల మండలంలోని ధర్మవరం పంచాయితీ, దిబ్బలపాలెం గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించి పూరి గుడిసె దగ్ధమయ్యాయి. ఆస్తి నష్టం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన నాయకులు శ్రీమతి క్రాంతి శ్రీ గారు 7 కుటుంబాల అగ్ని బాధితులను పరామర్శించి, వాళ్ళు కుటుంబాలకు నెల సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. శ్రీమతి క్రాంతి శ్రీగారు మాట్లాడుతూ అలాగే ప్రతీ బాధితులకు ప్రభుత్వం ఆదుకోవాలని తెలియజేసారు. వారికి ఏం అవసరం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గురిజా. శ్రీనివాస్ రావు గారు, లావేరు MPTC అభ్యర్థి రాజా రమేష్ గారు, పాతకుంకాం MPTC అభ్యర్థి దుర్గారావు, కాకర్ల బాబాజీ, సాయి, శివ, ఆనంద్, రామారావు, జయప్రకాశ్, అలాగే గ్రామ ప్రజలు జనసైనికులు పాల్గొన్నారు.

## పుష్కర ఘాట్ల నాణ్యతపై దృష్టిపెట్టాలి : జనసేన ఎమ్మిగనూరు ఇంచార్జ్ రేఖగౌడ్



కర్నూలు ( జనస్వరం ) : తుంగభద్ర పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పుష్కర ఘాట్లను ఉన్నత అధికారుల పర్యవేక్షణలో పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని జనసేనపార్టీ రాష్ట్ర మహిళ సాధికార ఛైర్మెన్ రేఖగౌడ్ తెలిపారు. ఎమ్మిగనూరు జనసేనపార్టీ కార్యాలయంలో ఎమ్మిగనూరు మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేఖగౌడ్ మాట్లాడుతూ పుష్కరాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. కోట్లు ఖర్చు పెట్టి పుష్కర ఘాట్లను ఏర్పాటు చేయిస్తున్న ప్రభుత్వం వాటి నాణ్యతను పరిశీలించకపోతే తీవ్రనష్టం జరుగుతుందని అన్నారు. కరోనాను దృష్టిలో పెట్టుకొని ప్రజలు జాగ్రత్తగా దీపావళి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చెడుపై మంచి సాధించిన విజయంలో వాయు కాలుష్యం నివారణకై కృషి చేస్తూ ముందుకు పోవాలని కోరుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## విజయనగరంలో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం



విజయనగరం ( జనస్వరం ) : నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయాన్ని బాలాజీ నగర్ లో (హిమగిరి సప్తగిరి థియేటర్ ఎదురుగా) బుధవారం మధ్యాహ్నం జనసేన పార్టీ విజయనగరం ఇంచార్జ్, జనసేన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యురాలు శ్రీమతి పాలవలస యశస్వి గారు ప్రారంభించారు. కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం యశస్వి గారు మాట్లాడుతూ జనసేన పార్టీని మరింత బలోపేతం దిశగా తీసుకెళ్లేందుకు ఈపార్టీ కార్యాలయం కేంద్రబిందువు అవుతుందని, జనసైనికులకు మరింత అండగా ఉంటూ వారికి భరోసా కల్పిస్తామని, ఈ కార్యాలయం నుండే భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించి జనసేన బీజేపీ కూటమితో రానున్న స్థానిక పురపాలక ఎన్నికల్లో విజయకేతనం ఎగరవేస్తామని అన్నారు. ప్రారంభోత్సవానికి అతిథిలుగా విచ్చేసిన బీజేపీ నాయకులు శ్రీ కుసుమంచి సుబ్బారావు గారు మరియు శ్రీ పాకలపాటి మురళి గారు విచ్చేసి వారు మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పాలవలస యశస్వి గారికి ( మిగతా 3 లో )

## సంపాదకీయం

# మట్టి మనిషినండి నేను...
# నా గోడు వినరండీ...



ఎందరో మహానుభావులు.. అందరికీ వందనాలు.. వంద అణాలు కూడా కూడబెట్టుకోలేని నా రైతన్నకు శతకోటి వందనాలు... ప్రభువులు ప్రభుత్వాలు మారతాయి. నా రైతు బ్రతుకు మారదు. తన కాళ్ళకు పగుళ్ళైతే ఇసుమంతైనా పట్టించుకోని ఆ మట్టిమనిషి తన భూమిలో ఏర్పడిన పగుళ్ళకు గుండె బద్దలై ఆకాశం వైపు చూస్తాడు. తన ఒంట్లో పుండు పుడితే రవ్వంతైనా ఖాతరు చేయని గట్టిమనిషి. తన పంటకు పురుగు పడితే విలవిలలాడిపోతాడు. అంతకన్నా ఏం చేస్తాడు.. అప్పు చేసి కొన్న విత్తనాలు నకిలీ, కడుపు మాడ్చి కొన్న పురుగుమందు నకిలీ, సర్కారు వారిచ్చే ఎరువు నకిలీ. ఈ నకిలీ జీవితాలలో తాను బ్రతకలేకున్నాడు.. ఎందుకంటే తాను బ్రతకనేర్చినవాడు కానే కాడు. నలుగురికి వండిన కూడేసేవాడే గానీ, డబ్బును కూడేసేవాడు కాదయ్యా మన రైతన్న. కుటుంబ పోషణ తలకు మించిన భారమని తెలిసి, రెక్కాడితే గానీ డొక్కాడదని తెలిసి, రోజూ కాయ కష్టం లోనే తన సుఖాన్ని వెతుక్కునే మన రైతు. తన భారాన్ని కుటుంబానికి కనబడనీయకుండా తన చిరునవ్వులతో కప్పేస్తాడు. తన శరీరంపై ఏర్పడ్డ గాయాలను మట్టితో కప్పేస్తాడు. సేదతీరే సమయం లేనివాడు రైతన్న. పట్టి మంచం ఎరుగడు, మట్టే తన మంచం, పచ్చగడ్డే పట్టుపరుపు.. పంటచేలో వచ్చే శబ్ధాలే తనకి జోలపాట.. తనకంటూ కోరికలేమున్నాయని, మేడలు మిద్దెలు కట్టాలనుకుండా? కార్లు విమానాల్లో తిరగాలనుకుంటాడా?? సమయానికి ఆకాశం వరుణించి, భూమాత కరుణించాలని కోరుకుంటాడు.. తన చేనుకిచ్చే విలువ తన మేనుకివ్వడు. ఎందరమో గొప్పవాళ్ళమయ్యాం. అందులో మన రైతన్నలు ఎందరున్నారు?? చిన్ననాటి నుండి కష్టపడి పైకొచ్చి స్థిరపడ్డవాళ్ళందరూ ఒక్కసారి ఆలోచించండి? రైతన్నకు ఆ స్థిరత్వం ఏనాటికైనా దక్కుతుందా?? రైతును ఈ శాశ్వత అస్థిరత్వం నుండి కాపాడేదెవరు? పల్లెటూళ్ళే పట్టుకొమ్మలు, రైతే వెన్నెముక.. ఈ నినాదం వచ్చాక ఎన్ని పల్లెలు పట్నాలయ్యాయో, ఎందరు రైతుల వెన్నెముకలు విరిగాయో? రైతే రాజు అని నా దేశం చాటి చెప్పింది.. కానీ, ఆ రాజు నిజానికి దాసుడు.. ఔను మన రైతన్న దాసుడు.. ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్ళకు దాసుకు దళారీల దోపిడీలను చెప్పుకోలేని బలహీనుడు.. ఒకవేళ పెదవి విప్పినా కడుపుకే చురకపడుతుంది..

పంట పండించడం ఒక కళ. కానీ తాను ఇది నా బాధ్యత అనుకుని చెయ్యడు. ఇది నా కర్తవ్యం అనుకుంటాడు. దళారీలు రైతన్నల దగ్గర బేరాలు పెడతారు, వారి చెప్పిన రేటుకు పంటను అమ్మకానికి ఇవ్వడం కుదరదు అని చెప్తే తన సరుకును కొనకుండా బయటే ఉంచేయడమో లేక వచ్చే ఏడు పంట కొనకపోవడమో చేస్తారు.. తాత మరి కాస్త బెల్లం చందంగా మొత్తం తీస్కుని మాకేం తెలుసు.. ఇంకా మేము కాబట్టి మీకు సహాయంగా ఉన్నాయ అని అంటారు.. ప్రభుత్వాలు రైతులకిచ్చే మాటలు నీటి మీదరాతలు ఔతున్నాయి. నల్లనయ్య మన్ను తిన్నాక నోరు తెరవగా ఈ బ్రహ్మాండమంతా కనబడుతుంది. నిజానికి చిన్నికృష్ణుడు మట్టిలోనే సర్వం ఉందని చెప్పదలచాడేమో. అలాంటి మట్టిని నమ్ముకున్న రైతన్నకు మిగిలింది మట్టేనా? విదేశీ వ్యాపారులు కూడా మన దేశంలో ఎన్నో వ్యాపారాలు చేసి ధనవంతులయ్యారు.. ఇక్కడున్న మన రైతన్న ఇంకా రోజు ఎలా గడుస్తుందా అని ఆలోచిస్తున్నాడు. మన తిండిని పండించే రైతన్న ఏనాడైనా మూడుపూటలా తినగలుగుతున్నాడా? స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళైనా ఈ మట్టినినిషిని పట్టించుకున్నదెవరు?

తనకంటూ తగు సమయాన్ని కేటాయించుకోలేని దురదృష్టవంతుడు రైతన్న..నిత్యమూ ఎండలో ఎండినా, వానలో తడిసినా తన పాదాలకు ముళ్ళు ఎన్ని గుచ్చుకున్నా, కోత కోసేటపుడు చేతులకు ఎన్ని గాయాలైనా, ఇవన్నీ తనకు చాలా చిన్నవి. ఎందుకంటే తను పంట అనే తపస్సు చేస్తున్న యోగి పుంగవుడు. ఈ మట్టిమనిషి విలాసాల కులాసాలు ఎరుగడు.కళాశాలకు వెళ్ళిన వాడు కాదు. చదువు రాదని తనని తాను తిట్టుకుంటాడు. తన బిడ్డలకైనా చదువులు అబ్బాలని తాపత్రయ పడే మనిషి..

పొలాల నన్నీ, హలాల దున్నీ, ఇలాతలంలో హేమం పిండగ, జగానికంతా సౌఖ్యం నిండగ అని మహానుభావుడు శ్రీశ్రీ గారు చెప్పిన కవితలను గొప్పగా చెప్పుకోవడమే గానీ, ఈ ధరిత్రిని పాదాలతో తాకి చాలా ఏళ్ళైంది.. మట్టి పాదానికి తాకితే అదేదో పాపమన్నట్టుగా, మట్టికి మన పాదానికి ఉన్న బంధాన్ని చెప్పులు ఏనాడో కప్పేశాయి.. అప్పుడే పుట్టిన శిశువు పాదాలను తల్లి ముద్దాడినట్టు, తన పాదాలను నిత్యం ముద్దాడుతుంది ఈ పుడమి తల్లి అని రైతన్నలు చెప్తారు. మనిషి నక్షత్ర మండలాలకు ప్రయాణం చేస్తున్నాడు, చంద్రమండలంలో భూములు ఇప్పుడే కొంటున్నాడు. కానీ, తాను నిలబడ్డ ప్రాంతంలో ఒకప్పుడు పంట సిరులు పండాయని, అది ఓ రైతన్న రెక్కల కష్టమని తెలుసుకోలేకపోతున్నాడు...

అయ్యా తాను అలా లేకపోతే మీ కడుపు నిండదని తెలుసుకోండి. నాటి మోతుబరుల దగ్గర నుంచి నేటి దళారుల వరకు ప్రతి ఒక్కరూ రైతు కష్టం మీద పైకొచ్చినవారే. అందుకే మన దేశంలో వైద్యుల పిల్లలు వైద్యులు, ఏ అర్హతా లేకపోయినా నాయకుల పిల్లలు నాయకులు అవ్వాలనుకుంటున్నారు గానీ, రైతు బిడ్డలు రైతులుగా మారాలనుకోవడం లేదు. ఇందుకు చాలా కారణాలున్నాయి. వాటిని అధిగమించాలి రైతు అంటే చాల మందికి చులకన, వ్యవసాయం చేస్తున్నాను అంటే ఏ పనీ చేయడు అనే ముద్ర పడుతుందేమో అన్న భావన నేటి సమాజంలో బలంగా ఉంది. ఆ భావాన్ని సమూలంగా నాశనం చెయ్యాలి. వర్షాధార పంటలకు సరైన సమయంలో నీరందదు అనుకుంటారు. ప్రతి అర్హత గల రైతుకు మోటారు వేయిస్తామని ప్రభుత్వాలు చెప్తున్నాయి. అవి తప్ప అన్యమైనవి ప్రచారం చేస్తున్నాయి. రైతులకు అవగాహన సదస్సులు ఏర్పరచి, వారిలో ధైర్యాన్ని చైతన్యాన్ని తీసుకురావాలి.

వ్యవసాయం మన పెద్ద చదువులలో పాఠ్యాంశాలుగా ఉన్నాయని ఎందరికి తెలుసు.. రైతుబిడ్డలను ఈ దిశగా నడిపే ప్రయత్నం చేయాలి. రైతుగా బ్రతకడం ఒక అదృష్టమని జనసేనాని పవన్ కళ్యాణ్ వంటి నాయకులు పాలేకర్ విధానాలను తెలుగు నేలకు పరిచయం చేసారు. ఆయన రైతుగా ఉంటూ ఎందరికో ఆదర్శంగా నిలిచారు. జైకిసాన్ అంటూ ఎలుగెత్తారు. ఈ తరం యువత అపోహలను వీడి వ్యవసాయానికి గట్టి పునాది వేయాలి. మట్టి మనిషే గట్టి మనిషి అని నిరూపించాలి. మహాభారతంలో బలరాముని ఆయుధం నాగలి గా చెప్పబడింది. ద్వాపరయుగంలో స్వయంగా వ్యవసాయం చేయడం గొప్ప పనిగా భావించేవారు. యుగాలు మారినా భారతదేశంలో భూమాత పంట సిరులు కురిపించింది. పుట్టిన నాటి నుండి కడుపు నింపుకోవడమే గానీ దాచుకోవడం తెలియని అమాయకుడు మన రైతన్న.

లాక్ డౌన్ సమయంలో ఇంచుమించుగా అందరూ "వర్క్ ఫ్రమ్ హోమ్" అని ఇంట వద్ద ఉంటూనే జాగ్రత్తగా సంపాదించుకున్నారు. వ్యాపారస్తులందరూ ఆన్ లైన్ బాట పట్టారు. సంపాదనా మార్గం పసిగట్టారు. మరి మన రైతన్నకు ఏదీ వర్క్ ఫ్రమ్ హోమ్. తను భూమికి పోకుంటే తనపైన అలుగుతుంది. అలుపన్నది లేకుండా కష్టపడితేనే పెట్టిన పెట్టుబడి కన్నా కొంతైనా లాభం ఉండేది. గుడికి వెళ్ళిన ఎవరైనా దేవుడా రైతు బాగుండాలి, అతనికి పంటలు బాగా పండాలి, వర్షాలు సమయానికి కురవాలి అని ఏనాడైనా కోరుకున్నారా? ఒకవేళ లేకపోతే ఇకనుంచి రైతు గురించి కూడా కోరుకోండి. మకుటాలు లేని మహారాజులైన రైతులు బాగుంటేనే దేశం బాగుంటుంది. తనకు చదువు లేకపోవచ్చు, కానీ తనకు చేతిలో మంచి విద్య ఉంది. బీడు భూమిలో కూడా బంగారం పండించేంత విద్య ఉంది. విద్యయే యశస్సు, భోగకరి అని ఓ మహాకవి అన్నాడు. ఆ విషయం లో రైతుకు యశస్సూ లేదు, భోగవిలాసాలకు సమయమూ లేదు. తెలంగాణ గడ్డపై గద్దరన్న, అందెశ్రీ, సిక్కోలు సింగడు వంగపండు వంటి వారు రైతుల గూర్చి వారి సాహిత్యం ద్వారా ప్రజల్లో చైతన్యం కొంత చైతన్యం తీసుకొచ్చారు. గుహుడిని గుండెల్లో పెట్టుకున్న రాముడిగానో, కుచేలుని వెతలు రూపు మాపిన శ్రీకృష్ణునిగానో వచ్చి రైతుల కష్టాలను తెలగించగలిగితే ఎంత బాగుంటుంది. ఈ కరోనా విపత్తును రైతన్న ఎదుర్కొని, సంపూర్ణ పూర్వ మానవుని గా మారాలని ఆకాంక్షిస్తున్నా.గుడిలో ఏముందీ, బడిలో ఏముందీ అని ఆ రెండిటి గొప్పతనాన్నీ ఓ గేయ రచయిత చక్కని పాటగా మలిచాడు. నారు మడిలో ఏమున్నదీ కూడా తెలుసుకుంటే మన కిరీటంలేని కిసాను రాజుల గురించి కూడా తెలుస్తుంది.

" మకుటం లేని మహారాజైన మన రైతన్న ధరణీరథమును అధిరోహించి ఈ విశ్వాన్నే ఏలుతున్న నారాయణుడి పదుకుండవ అవతారం "

కుడి నుండి ఎడమకు, ఎడమ నుండి కుడికి ఎటునుండి చదివినా ఒకే అక్షరమాల గల వికటకవి తరహా పద్యం మన రైతన్నలకు అంకితమిస్తున్నా..

// పైరూ చేలేలనే గమన తపన పతనమగ నేల
లేచే రూపై //
// నగుమోము కనక నీవే నవ్వినవేనీ,
కనకము మోగున?? //
// నాపయు చేనే గనేవా పండిగడింప వానేగ,
నేచేయు పనా?? //
// దయచేయ దరిచేరి హలమే ధరణీరథ మేల
హరిచేరి దయచేయద?? //

**భావము:**

మొదటి పాదం: పైరు చేను ఎందుకో నాలో అలజడిని, తపనను పోగొట్టడానికి అన్నట్టు, నేలే పైకి లేచిందా అన్నట్టుగా ఉంది

రెండవ పాదం: మా మొహములలో నవ్వు కనింపించటం లేదని నువ్వు నవ్వుతున్నావేమో... కంచు మోగినట్లు కనకము మోగదు కదా

మూడవ పాదం: నాపచేనయినా చూచినా, పంట పండి నీకు లాభం చేకూర్చేది వానే కానీ నీవూ నేనూ చేయగలమా

నాల్గవపాదం: నాగలి వచ్చీ రాగానే ఈ భూమిని చీల్చి పంటకు సాయం చేస్తుంది...అది స్వయంగా శ్రీకృష్ణుని చేరి వచ్చింది..

" రైతును కాపాడుకుందాం,
దేశాన్ని కాపాడుకుందాం.."

జనస్వరం ద్వారా జనసర్వానికి రైతన్న విలువ తెలియజేయాలని నా ఈ చిన్న ప్రయత్నం.

BY

ఓ సత్యకాలపు కవి

ట్విట్టర్ ఐడి : @Mssatyasai

## ప్రజల కోసం బలంగా మన గొంతు వినిపించండి

( మొదటి పేజీ తరువాయి )

వినిపించండి. ఆ ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యే దిశగా పని చేయాలి. సమస్యల పరిష్కారంలో జనసేన పార్టీ తరపున అందరం క్రియాశీలకంగా వ్యవహరించాలి. మీ వెన్నంటి నేను ఉంటాను. ఆదిలాబాద్ జిల్లాలోని, మారుమూల ప్రాంతాల్లో కావచ్చు... కరీంనగర్ జిల్లాలోని ఓ గ్రామంలో కావచ్చు... పాలమూరు రైతులు, కూలీల ఇబ్బందులు కావచ్చు... ఎక్కడ ఎవరికి ఏ ఇబ్బంది కలిగినా స్పందిద్దాం. మన వంతుగా మనం అండనిచ్చి నిలబడదాం. ఎప్పటికప్పుడు కమిటీలతో సమావేశం అయి చర్చిద్దాం" అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉపాధ్యక్షులు శ్రీ బి.మహేందర్ రెడ్డి, తెలంగాణ ఇంచార్జ్ శ్రీ ఎన్.శంకర్ గౌడ్, ముఖ్య నాయకులు శ్రీ రామ్ తాళ్ళూరి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు శ్రీ ఆర్.రాజలింగం పాల్గొన్నారు.

## మానవత్వంతో నిరుపేద వృద్ధురాలకు ఇంటిని నిర్మిస్తున్న కోడూరు జనసైనికులు



కృష్ణా ( జనస్వరం ) : పాశం సీతమ్మ అనే ఒక నిరుపేద వృద్ధురాలకు అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు జనసైనికులు ఇంటి నిర్మాణం చేయడానికి తలపెట్టారు. సామాజిక మాధ్యమాల్లో వృద్ధురాలి పరిస్థితిని తెలుసుకున్న స్థానిక జనసైనికులు, NRI జనసైనికులతో చర్చించి సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఆ వృద్ధురాలితో పాటు ఒక మనువరాలు ఉంది. ఆ అమ్మాయి తల్లిదండ్రులు చిన్నపుడే మరణించారు. నాగాయలంక జనసైనికులు బొడ్డు విజయ్ మిత్రబృందం సహకారంతో ఈ వృద్ధురాలుకు ఇంటి నిర్మాణం కోసం జనసేన పార్టీ తరపున 21వేల రూపాయలు నగదు సీతమ్మ గారికి ఇవ్వడం జరిగింది. అదే విధంగా సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకోని అమెరికాలో ఉంటున్న NRI సంధ్య గారు వృద్ధురాలు కుటుంబంకు ఆమె వంతుగా 7500 రూపాయలు ఇవ్వటం జరిగింది. దాతలు సహాయం చేసిన డబ్బులతో మీడియా మిత్రులు శ్రీనుగారు, రవిశంకర్ గారు పాత పూరిపాక తీయించి దాని స్థానంలో నూతనంగా ఇంటి ప్లాన్ వేయించి పాశం సీతమ్మ గారి మనుమరాలుతో భూమి పూజ చేపించి ఇంటి నిర్మాణము కోసం శంకుస్థాపన చెయ్యటం జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధిగా కోడూరు సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ గారు పాలుగున్నారు. ఈ నిరుపేద వృద్ధురాలు కుటుంబంకు అండగా నిలిచి, సమాజంలో ఇలాంటి మంచి పనికి సహకారం అందించిన దాతలకు ధన్యవాదములు తెలిపారు.

## విజయనగరంలో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

( మొదటి పేజీ తరువాయి )

మరియు జనసైనికులకు శుభాకాంక్షలు తెలుపుతూ త్వరలోనే విజయనగరం నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరికి ఓ టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ప్రభుత్వం అందించాల్సిన మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కరించాలని నిర్ణయించామన అన్నారు. జనసేన, బీజేపీ కూటమితో కలసి ప్రజాసమస్యలపై పోరాడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఝాన్సీ వీరమహిళలు శ్రీమతి ముదిలి సర్వమంగళ గారు, శ్రీమతి గంట్లాన పుష్పకుమారి గారు, శ్రీమతి గాయత్రి గారు, జనసేన సీనియర్ నాయకులు శ్రీ ఆదాడ మోహనరావు గారు, జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు, త్యాడ రామకృష్ణారావు(బాలు), జనసేన నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## రైలు ప్రమాదంలో కాలు కోల్పోయిన జనసేన అభిమానికి పాండిచ్చేరికి చెందిన జనసేన వీర మహిళ భవాని రూ.1,20,000 సహాయం



పాండిచ్చేరి ( జనస్వరం ) : రైలు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్న జనసేన అభిమాని శ్రీ రామచంద్రరావు గారి కుటుంబం గురించి తెలుసుకుని, జనసేన నాయకులు శ్రీ గేదెల చైతన్య గారి ఆధ్వర్యంలో వైద్య నిమిత్తం ₹1,20,000 సహాయం చేసి అండగా నిలిచిన పాండిచ్చేరికి చెందిన జనసేన పార్టీ వీర మహిళ భవానీ గారు. తాను మాట్లాడుతూ ఎవరికి ఏం కష్టం వచ్చినా అండగా ఉంటానని అన్నారు. పవన్ కళ్యాణ్ గారి స్ఫూర్తితో చేశానన్నారు.

## మరుగుదొడ్ల కుంభకోణం పై చర్యలు తీసుకోవాలి : ఎస్ కోట నియోజకవర్గ జనసేన నాయకులు



విజయనగరం ( జనస్వరం ) : లక్కవరపు కోట మండలం, రేగ గ్రామంలో మరుగు దొడ్ల కుంభకోణం జరిగిందని, నిర్మాణాలు చేయకుండా బిల్లులు పెట్టి ఆ డబ్బులు వాడుకున్నారు. మరుగు దొడ్లు కట్టినవాళ్ళకి బిల్లులు ఇవ్వకుండా, మరుగుదొడ్లు కట్టని వాళ్ళకి బిల్లులు ఇస్తున్నారని మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ గారికి చెప్పడం జరిగింది. అలాగే ఈ కుంభ కోణంలో బాధ్యులు అయిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, వాటర్ ట్యాంక్ క్లీన్ చేయాలనీ అలాగే పాడైపోయిన పైపులు తీసి కొత్తవి వేయాలని చెప్పడం జరిగింది. మరియు పంచాయితీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది ఆఫీస్ టైం కి వచ్చి వెళ్లాలని ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ఇదే సమస్య మళ్ళీ పునరావృతం అయితే పై అధికారులకి కంప్లయింట్ చేస్తామన్నారు. మురుగు కాలువలు పూడిక తీయాలని వరసాలకి నీరు ఇళ్లల్లోకి వచ్చేస్తుంది అని వాపోయారు. చెరువులో చేపలు అనధికారకంగా దోచుకుంటున్నారని, కావున వేలం పెట్టి ఆ డబ్బులు పంచాయితీ ఖర్చులకు గ్రామ అభివృద్ధికి వాడాలని సూచించారు. గ్రామం అంత పరిశుభ్రం చేయాలనీ శానిటైజర్ చేయించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ కోట నియోజకవర్గం ఇంచార్జి ఒబ్బిన సన్యాసినాయుడు, మండల అధ్యక్షులు రావాడ నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఆర్ రెహమాన్, జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

## కువైట్ లో ఇబ్బందులు పడుతున్న భారతీయుడికి విమాన టికెట్, ఆర్థిక సహాయం చేసిన NRI జనసేన నాయకుడు రామచంద్ర నాయక్



కువైట్ (జనస్వరం) : గత కొద్ది నెలలుగా లాక్ డౌన్ నేపథ్యంలో స్వదేశానికి వెళ్లడానికి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న కడప జిల్లాకు చెందిన ప్రసాద్ నాయుడు అనే వ్యక్తి కి జనసేన ఎన్నారై సేవా సమితి అధ్యక్షుడు శ్రీ బాణావతి రామచంద్ర నాయక్ తన స్వంత డబ్బుతో విమాన టికెట్ ను మరియు దారి ఖర్చులకు మొత్తంగా సుమారు 50,000వేల రూపాయలను ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా రామచంద్ర నాయక్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో జనసేన ఎన్నారై సేవా సమితి కువైట్ ఎల్లప్పుడూ ముందు ఉంటుందని తెలిపారు.

## వై యస్ ఆర్ జలకళ పథకంపై తక్షణమే అసైన్డ్ కమిటీ ఏర్పాటు చేసి రైతులకు పాస్ బుక్స్ కల్పించాలి



జగ్గయ్యపేట ( జనస్వరం ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రైతుల కోసం ఏర్పాటు చేసిన వై యస్ ఆర్ జలకళ పథకం అనేది ప్రతి ఒక్క రైతుకు ఉపయోగపడే విధంగా పాస్ బుక్స్ కల్పించాలని ముఖ్యంగా జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల మేరకు యస్ సి (SC) ఆక్ట్ అసైన్డ్ క్రింద ఉన్న వారికి కూడా కల్పించే విధంగా కొన్ని చర్యలు తీసుకుని తక్షణమే రాజకీయ నాయకుల సమక్షంలో అసైన్డ్ కమిటీ ఏర్పాటు చేసి ఈ పథకాన్ని పునరుద్ధరించాలని జనసేన పార్టీ తరపున జగ్గయ్యపేట నియోజకవర్గ నాయకులు ఈమని కిషోర్ కుమార్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల తహశీల్దారు వారికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో కిషోర్ కుమార్ మాట్లాడుతూ వై యస్ ఆర్ జలకళ పథకం అనేది అర్హత ఉన్న ప్రతి ఒక్క రైతుతో పాటుగా చిన్న సన్నకారు రైతులకు కూడా ఉపయోగపడేలా చూడాలని, అడంగల్ (సాగుబడి), 1బి ఆసామి (యజమాని), పాస్ బుక్ (పట్టాదారు) ఈ పథకానికి అర్హులైన వారందరికీ ఇవన్నీ కావాలని, లేని ఎడల ఆన్లైన్ లో అప్లోడ్ అయ్యే పరిస్థితి లేదు అని, కనుక తక్షణమే రాజకీయ నాయకుల సమక్షంలో ఒక అసైన్డ్ కమిటీ ఏర్పాటు చేసి తక్షణమే రైతులకు ఈ పాస్ బుక్స్ కల్పించి ఈ పథకాన్ని పునరుద్ధరించాలని లేని ఎడల ఈ పథకానికి తూట్లు పొడిచినట్టు అవుతుందని వారు తెలిపారు. లేదంటే ధర్నా కార్యక్రమాలు కూడా చేయడానికి వెనుకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగ, గోపి, నరసింహ, శ్రీకాంత్, దేవ, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నచిన్న సమస్య లను సకాలంలో పరిష్కరించ లేరా...? : జనసేన నాయకులు యుగంధర్ పొన్నాల



నెల్లూరు ( జనస్వరం ) : నెల్లూరు నియోజకవర్గం, కార్వేటి నగరం గ్రామ పంచాయితీకి చెందిన పద్మ అనే మహిళకు గత సంవత్సరం జులై 2019 నుండి 2020 వ సంవత్సరం ఆగష్టు వరకు పెన్షన్ ఇచ్చారు. ఆ తరువాత పెన్షన్ ఆపేసారు. సంబధిత అధికారిని అడిగితే సరిగా స్పందన రాలేదు. ఈ విషయమై నియోజకవర్గ ఇంచార్జి Dr యుగంధర్ పొన్నాల గారు మండలపరిషత్ అభివృద్ధి అధికారి ఇదివరలో దీనికి సంబంధించిన విజ్ఞప్తి చేయడం జరిగింది. మరలా రెండవ సారి కలిసి వెంటనే పరిష్కరించాలని కోరారు. రెండు రోజుల్లో ఈ సమస్యని పరిష్కరించక పోతే ఇక్కడే నిరాహార దీక్ష జనసేన చేయవలసి వస్తుందని, దానికి కూడా స్పందన రాకపోతే కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహిస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న చిన్న సమస్యలను కూడా సకాలంలో పరిష్కరించకపోతే, ఇక పెద్ద పెద్ద సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తారు అని తెలిపారు. జనసేన ఎప్పుడూ చిన్న సమస్య, పెద్ద సమస్య అని చూడదు, సమస్య ఏదైనా సరే ప్రజాపక్షం నిలబడుతుందని తెలిపారు. అలాగే ఈ సమావేశంలో రాబోయే స్థానిక ఎన్నికల గురించి చర్చించి ఎన్నికలకు సమాయత్తం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సురేష్ నాయుడు, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, భాస్కర్ రెడ్డి, కార్యనిర్వాహక కారదర్శి దేవ, కార్యదర్శి హేమాద్రి, సమన్వయ కర్త రాఘవ పాల్గొన్నారు.

## జనసేన ప్రెస్ నోట్స్

### సలాం కుటుంబమంతా ఆత్మహత్య చేసుకొనే పరిస్థితులు కల్పించిందెవరు?

నంద్యాలలో ఆటో డ్రైవర్ శ్రీ అబ్దుల్ సలాం కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకోవడం అత్యంత దురదృష్టకరం. ఒక వ్యక్తి తన భార్య, బిడ్డలతో కలిసి ఉసురు తీసుకొన్నాడు అంటే ఎంతటి ఒత్తిడిని, మానసిక వేదనను అనుభవించి ఉంటాడో అందరం అర్థం చేసుకోవాలి. ఒక కేసు విచారణలో శ్రీ సలాం, అతని భార్యను పోలీస్ స్టేషన్ కు పిలిచిన నేపథ్యంలో ఈ ఆత్మహత్య చోటు చేసుకుంది. విచారణ ఆ దిశలో సాగిందా? ఒక కుటుంబం సామూహికంగా ప్రాణాలు తీసుకొనే పరిస్థితులు కల్పించినవారెవరు? అనే వాస్తవాలు వెల్లడి కావాలి. ఈ బాధాకర ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ కేసు విషయంలో ప్రభుత్వ చర్యలు నాటకీయంగా కనిపిస్తున్నాయి తప్ప ఎక్కడా చిత్తశుద్ధి లేదు. నంద్యాలలో శ్రీ సలాం కుటుంబానికి జరిగిన అన్యాయమనే కాదు... ఇలాంటి ఘటనలు ఉత్పన్నం కావడానికి అసలు కారణం పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడమే వ్యవస్థలో భాగమైన పోలీసులు తమకున్న నియమ నిబంధనలను, చట్టాన్ని అనుసరించే క్రమంలో పాలకుల జోక్యానికి తావిస్తే ఇలాంటి దురదృష్టకర పరిస్థితులే తలెత్తుతాయి. సీతానగరంలో పోలీసులే ఒక ఎస్సీ యువకుడికి శిరోముండనం చేయించారు. విశాఖపట్నంలో డా.సుధాకర్ విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరు కావచ్చు, రాజధాని రైతులకు బేడీలు వేయడమైనా... ఇలాంటి వరుస ఘటనల్లో పోలీసులను వెనక నుంచి నడిపిస్తున్నవారిపై మనం దృష్టిపెట్టాలి ముస్లింలపై జరిగితే మైనార్టీలని, ఎస్సీలపై జరిగితే ఆ వర్గం గురించి ప్రస్తావించడం ద్వారా పాలకులు సులభంగా ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారు. తోటి మనిషికి... అతని కుటుంబానికి జరిగిన అన్యాయంగా మనం భావించకుండా చేస్తున్నారు. ప్రభుత్వాన్ని నడిపేవారి ధోరణిని ప్రశ్నించేటప్పుడు బాధితులను ఒక వర్గానికి పరిమితం చేసి మాట్లాడి సమస్యను పలుచన చేయడం జనసేన విధానం కాదు.

వ్యవస్థ మూలంగా ఎవరికి ఎలాంటి అన్యాయం, ఇబ్బంది కలిగినా కులం, మతం, ప్రాంతంలాంటి హద్దులు గీసుకొని స్పందించడం వల్ల న్యాయం జరగదు సరికదా సమస్య తీవ్రత తగ్గిపోతుంది. నంద్యాలలో శ్రీ సలాం కుటుంబం ఆత్మహత్యనే తీసుకొంటే వారంతా మనలో ఒకరు అనేభావనతోనేబలంగానిలదీద్దాంప్రజావ్యవస్థలో భాగమైన పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. అధికార పార్టీ నేతల చేతుల్లో ఆయుధాలుగా మారితే చివరకు ఇరుకునపడి బలిపశువులుగా మారేది క్షేత్ర స్థాయి విధుల్లో ఉండే పోలీసులే. అధికారంలో ఉన్నవారి నుంచి ఒత్తిళ్ళు వస్తే వాటిని నిలువరించి, నిబంధనలు పాటించే స్థైర్యం పోలీసుల్లో ఉన్నప్పుడే ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవు. పోలీసులు తమ దగ్గరకు వచ్చే ప్రజలపట్ల మానవతా దృక్పథాన్ని కనబరచాలి. అప్పుడే ప్రజలకు పోలీస్ వ్యవస్థ పట్ల నమ్మకం కలుగుతుంది. శ్రీఅబ్దుల్ సలాం కుటుంబం సామూహిక ఆత్మహత్యకు విచారిస్తూ ఆయన బంధువులకు సంతాపం తెలుపుతున్నాము.

### శ్రీ పవన్ కల్యాణ్ గారితో పర్లాఖెముండి ఎమ్మెల్యే భేటీ

జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కల్యాణ్ గారిని ఒడిశా రాష్ట్రం పర్లాఖెముండి శాసనసభ్యులు, గజపతి జిల్లా బి.జె.పి. అధ్యక్షులు శ్రీ కోడూరు నారాయణరావు గారు సోమవారం హైదరాబాద్ లో కలిశారు. జగన్నాథ స్వామి చిత్రపటం అందచేశారు మర్యాదపూర్వకంగా సాగిన ఈ భేటీలో ఒడిశాలోని తెలుగువారి స్థితిగతుల గురించి, సరిహద్దు ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యల గురించి ప్రస్తావించారు. శ్రీ నారాయణ రావు గారు మాట్లాడుతూ గజపతి జిల్లా పరిధిలో తెలుగు మాట్లాడేవారు ఎక్కువమంది ఉన్నారని చెప్పారు. సరిహద్దు ప్రాంతంలో ఇరురాష్ట్రాల వారికి ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి జనసేన పక్షాన సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఇందుకు శ్రీ పవన్ కల్యాణ్ గారు సానుకూలంగా స్పందించారు. శ్రీ నారాయణ రావు గారు మాట్లాడుతూ "చిరంజీవి గారు, పవన్ కల్యాణ్ గారు అంటే ఎంతో అభిమానం. మా ప్రాంతం గురించి వివరించాను. ఎంతో సానుకూలంగా స్పందించారు రెండు రాష్ట్రాల ప్రజల మధ్య సత్సంబంధాలు ఉన్నాయి. పాలనాపరమైన నిబంధనల వల్ల కొన్ని సమస్యలు వస్తున్నాయి. వీటి గురించి ప్రస్తావించాను" అన్నారు. ఈ సమావేశంలో కాశీనగర్ సమితి అధ్యక్షులు శ్రీ చిత్రి సింహాద్రి పాల్గొన్నారు.

### వీర మరణం పొందిన సైనికులకు శాల్యూట్

దేశ సరిహద్దుల్లో ఉగ్రవాదులను కట్టడి చేసే క్రమంలో మన సేనల నుంచి నలుగురు అసువులు బాయడం బాధాకరం. దేశ భక్తితో, తెగింపుతో జమ్మూకశ్మీర్‌మాచిల్‌సెక్టార్‌లోవీరసైనికులుచేసిన పోరాటం అందరూ గుర్తుపెట్టుకొంటారు. వారికి నా తరఫున, జనసేన తరఫున శాల్యూట్ చేస్తున్నాను. వీర మరణం పొందిన వారిలో ఉన్న మన తెలుగు రాష్ట్రాలకు చెందిన శ్రీ చీకల ప్రవీణ్ కుమార్ రెడ్డి గారు, శ్రీ ర్యాడా మహేష్ గార్ల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. చిత్తూరు జిల్లా రెడ్డివారి పల్లెకు చెందిన శ్రీ ప్రవీణ్ కుమార్ రెడ్డి గారు గత 18 ఏళ్లుగా సైన్యంలో సేవలు చేస్తున్నారు. తన ప్రాంత యువకులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. నిజామాబాద్ జిల్లా కోమన్ పల్లి గ్రామానికి చెందిన శ్రీ ర్యాడా మహేష్ గారు తొలి నుంచి ఆర్మీలో చేరాలని లక్ష్యంగా నిర్దేశించుకొని సైన్యంలోసేవలు చేస్తున్నారు. మన తెలుగు రాష్ట్రాలకు చెందిన శ్రీ ప్రవీణ్ కుమార్ రెడ్డి గారు, శ్రీ మహేష్ గార్లు ఉగ్రవాదులు మన దేశంలోకి చొరబడకుండా చూపిన తెగువను ఎవరూ మరచిపోరు. ఈ వీర జవాన్ల కుటుంబాలను అన్నివిధాలా ఆదుకొని, అండగా నిలవాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలను కోరుతున్నాను. ఆ కుటుంబాలలో వారికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

### శ్రీ రఘునందన్ రావు, శ్రీ బండి సంజయ్ గార్లకు అభినందనలు

దుబ్బాకలో విజయం సాధించిన భారతీయ జనతా పార్టీ అభ్యర్థి శ్రీ రఘునందన్ రావు గారికి, బి.జె.పి. తెలంగాణ రాష్ట్ర నాయకత్వానికి శుభాబినందనలు తెలుపుతున్నాను. బి.జె.పి., ఆ పార్టీ నాయకత్వంపై ప్రజల విశ్వాసానికి నిదర్శనం దుబ్బాకలో ఈ విజయంగా భావిస్తున్నాను. ముఖ్యంగా బి.జె.పి. తెలంగాణ శాఖ నాయకత్వ పగ్గాలు స్వీకరించిన నాటి నుంచి నేటి దుబ్బాక ఉప ఎన్నికల వరకు శ్రీ బండి సంజయ్ గారు చూపిన నాయకత్వ పటిమ నేటి విజయానికి మార్గం వేసింది. పార్టీలోని అన్ని వర్గాలను సమాయత్తం చేసి ఆయన ఈ విజయాన్ని సాధించారు. అదే విధంగా శ్రీ రఘునందన్ రావు గారి వ్యక్తిత్వం, ప్రజా సేవలో చూపే నిబద్ధత ఆయనకు విజయ హారాన్ని అందించింది. రాజకీయాలను సక్రమ మార్గంలో నడిపించడం యువత వల్లే సాధ్యమవుతుందని నేను విశ్వసిస్తాను. ఈ ఎన్నికలో యువకులు విశేష సంఖ్యలో పాల్గొనడం ఒక శుభపరిణామం. దుబ్బాక విజయంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పేరు పేరున అభినందనలు తెలుపుతున్నాను.

### గ్రేటర్ ఎన్నికలకు జనసేన సంసిద్ధం

రాబోయే GHMC ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేయడానికి సిద్ధంగా ఉంది. అదేవిధంగా జనసైనికుల సహాయంతో ఇటు నమోదు కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నాం, ఎవరైనా కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలి అనుకుంటే ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక సమస్యలపై జనసేన పార్టీ పోరాడింది. జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి స్ఫూర్తితో ధర్నాచౌక్ సమస్యపై లాఠీ దెబ్బలకు కూడా వెను తిరగకుండా పోరాటం చేసాం. ఇంటర్ విద్యార్థుల సమస్యల పై పోరాటం చేసాం, జనసైనికులు, వీర మహిళలు అరెస్ట్ అయిన సందర్భాలు ఉన్నాయి. ఆర్టీసీ కార్మికుల సమస్య మా సొంత సమస్యగా భావించి, ఉద్యోగులు అందరికీ అండగా నిలిచి, సమస్య పరిష్కార దిశగా పోరాటం చేసాం. కరోనా - లాక్ డౌన్ సమయంలో జనసైనికులు ప్రతీచోట నిత్యావసరాలు పంపిణీ చేసి ప్రజలకు అండగా నిలిచారు. భారీ వర్షాల కారణంగా నగరం అంతా మునిగి, ప్రజలు ఇబ్బందులు పడుతూ ఉన్నప్పుడు మన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు తన వంతు సహాయంగా కోటి రూపాయలు సహాయం చేసి, బాధితులకు తోడుగా ఉండాలి, వారి సమస్యలు తెలుసుకోని , ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిస్కారం దిశగా అడుగులు వెయ్యాలని జనసైనికులకు పిలుపునిచ్చారు. ప్రతీ చోట మేము పర్యటించి, సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళా. గ్రేటర్ పరిధిలోని రామంతపూర్, ఎల్బీ నగర్, కూకట్ పల్లి, నాచారం, షేక్ పేట్ ఇంకా ఇతర ప్రదేశాల్లో ఉన్న ఎన్నో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. పేద ప్రజలకు రేషన్ కార్డు అందే వరకు మేము పోరాడనున్నాం, పేదలకు అండగా నిలుస్తాం. అలాగే క్యాబ్ డ్రైవర్ల సమస్య పై కూడా మేము పోరాడుతాం, వాళ్ళ డిమాండ్లకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలి. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అండగా ఉండాలి, మేము కూడా వాళ్ల పోరాటానికి కూడా అండగా ఉంటాం. జిహెచ్ఎంసి లో రోడ్ల పరిస్థితి బాలేదు కానీ టూ-వీలర్స్ మీద మాత్రం చల్లాన్లు మోత మోగిస్తున్నారు. బైకు అమ్ముకున్నా సరే చల్లాన్లు కట్టుకోలేని పరిస్థితి ఉంది. మాకు ఒక్క అవకాశం ఇచ్చి, ఆదరించండి, మీ సమస్యలపై మేము పోరాడుతాం. పరిష్కారం దేశంగా ముందుకు వెళ్తాం.

## జనసైనిక్ పంచ్

విజయ ( జనసేన వీర మహిళ )

» ప్రస్తుత ప్రభుత్వం అవలంబిస్తున్న విధానం చూస్తుంటే ఒక చేత్తో పథకాలు అందించి, మరొక చేత్తో వసూలు రూపంలో రాబడుతోంది. ఇది తెలియని ప్రజలు పావలా పథకాన్ని తీసుకొని రూపాయిని ప్రభుత్వానికి పన్ను రూపంలో కడుతున్నారు.

### ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

ఒకే రాకెట్ తో పది ఉప గ్రహాలను అంతరిక్షంలోకి పంపి అద్భుత విజయాన్ని సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియ చేస్తున్నాను. నెల్లూరు జిల్లా శ్రీహరి కోటలోని అంతరిక్ష కేంద్రం ద్వారా నింగికిఎగిసిన పి.ఎస్.ఎల్.వి - సి 49 రాకెట్ 1 దేశీయ, 9 విదేశీ ఉపగ్రహాలతో పాటు 135 కోట్ల మంది భారతీయుల ఆశలను కూడా అంతరిక్షానికి తీసుకువెళ్లడం దేశ ప్రజలందరికీ సంతోషకరమైన విషయం. మన దేశ వ్యవసాయ అభివృద్ధి, రైతుల ప్రయోజనాల కోసం మన శాస్త్రవేత్తలు ఉపగ్రహాన్ని ప్రయోగించడం ఎంతో హర్షణీయం. భారత్ శక్తి సామర్థ్యాలను మరోసారి ప్రపంచానికి చాటిన ఇస్రో శాస్త్రవేత్తలను ఎంత కొనియాడినా తక్కువే. ఈ విజయంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ నా తరఫున, జనసేన పార్టీ తరఫున శుభాభినందనలు తెలుపుతున్నాను.

### దుబ్బాక విజేతకు అభినందనలు

భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు శ్రీ బండి సంజయ్ గారి నేతృత్వంలో దుబ్బాకలో విజయం సాధించిన శ్రీ ఎం.రఘునందన్ రావు గారికి అభినందనలు. ఈ ఉప ఎన్నికలో బి.జె.పి. పతాకం ఎగురవేయడంలో ఎంతో కృషి చేసిన శ్రీ బండి సంజయ్ గారికి ప్రత్యేక అభినందనలు. ఆయన రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ఎదుర్కొన్న తొలి ఎన్నికలోనే పార్టీని విజయ తీరానికి చేర్చారు. ఎన్నికల సమయంలో ఎన్ని విధాలైన ఒత్తిళ్ళు ఎదురైనా తట్టుకొని నిలబడ్డారు. ఈ ఎన్నికల ఫలితాల ద్వారా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి నాయకత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసం అవగతం అవుతోంది.

## ఫార్మా కంపెనీ వ్యర్థాలను వీలైనంత త్వరగా తొలగించాలి : జనసేన బాడిశ మురళీకృష్ణ



కృష్ణా ( జనస్వరం ) : జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామ సమీపంలో గల కెమికల్ కర్మాగారలు నుండి వెలువడుతున్న కెమికల్ వ్యర్థ రసాయనాలను నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు బాడిశ మురళీకృష్ణ బృందం సందర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త బాడిశ మురళీకృష్ణ మాట్లాడుతూ వేదాద్రి గ్రామ సమీపాన ఉన్న ఫార్మా కెమికల్ కర్మాగారాల నుండి వెలువడుతున్న వ్యర్థ రసాయనాలను పబ్లిక్ స్థలాల్లో మరియు ప్రజావాసాల మధ్యలో మరియు రోడ్లపైకి యదేచ్ఛగా వదులుతున్నారు. ఆ వ్యర్థ నీటిని వదలడంతో చుట్టుపక్కల ఉన్న గ్రామ ప్రజలు మరియు కర్మాగారం రహదారి గుండా ప్రయాణిస్తున్న వారు ఆ దుర్వాసనకు తట్టుకోలేక అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని, ఆ వ్యర్థాన్ని అలా వదలడం వల్ల భూమిలోకి ఇంకిపోవడంతో భూగర్భ జలాలు కూడ కలుషితమవడంతో ప్రజలు అనేక రకాల జబ్బులు కు గురవుతున్నారని అన్నారు. ఆ వ్యర్థ నీటిని వదిలిన సంబంధిత స్థలాలలో పచ్చగా ఉన్న చెట్లు కూడా ఎండిపోవడంతో ఆ వ్యర్థ రసాయన నీరు ఎంత ప్రమాదకరమో తెలుస్తుందన్నారు. పొరపాటున ఆ నీటిని మూగజీవులు తాగితే తరువాత జరిగే పరిణామాలకు ఎవరు బాధ్యత వహిస్తారని దయచేసి స్థానిక అధికారులు సంబంధిత కర్మాగార యాజమాన్యానికి నోటీసు చేసి ఆ వ్యర్థాలని తొలగించేలా చూడాలని మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసైనికులు నవీన్, ప్రశాంత్, గోపి , కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం జనసేన BSU విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ



శ్రీకాకుళం ( జనస్వరం ) : శ్రీకాకుళం జిల్లా పాలకొండ నియోజకవర్గం జనసేన పార్టీ భగత్ సింగ్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వీరఘట్టం మండలం తెట్టంగి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం క్రీడా పరికరాలను పాలకొండ నియోజకర్గ జనసేన నాయుకుడు శ్రీ గర్భాన సత్తిబాబు గారి ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం జనసేన పార్టీ నుండి గతంలో పాఠశాలకు చేసిన సేవలకు గాను శ్రీ గర్భాన సత్తిబాబు గారి కి దుశ్శాలువాతో చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన భగత్ సింగ్ విద్యార్థి విభాగం నాయకులు గర్భపు నరేంద్ర BSU జిల్లా నాయకులు మరియు పాలకొండ పట్టణం జనసేన నాయకులు గొర్లె మన్మధరావు, కిషోర్, శ్యామ్, యోగి, ప్రశాంత్, వీరఘట్టం జనసేన పార్టీ నాయకులు రవికుమార్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కర్నూల్ జిల్లా నంద్యాల ఘటన పాశవికం, అమానుషం




కడప ( జనస్వరం ) : ఈ నెల 3 వ తేదీన అబ్దుల్ సలాం అనే వ్యక్తి అతని కుటుంబం ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నారని ఇంత హృదయ విధారకరమైన ఘటన చాలా బాధాకరమన్నారు. ఏపీలో పోలీసు వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న దానికి నిదర్శనం నంద్యాల ఘటన అని, ప్రతిపక్ష పార్టీల నాయకుల పై పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని ఇక సామాన్యుల పరిస్థితి ఏంటో అందరికీ తెలిసిందేనన్నారు. చేతులు కాలిన తరవాత ఆకులు పట్టుకున్న చందంగా ప్రస్తుత ప్రభుత్వ తీరు ఉందన్నారు. మొత్తం కుటుంబం ఆత్మహత్య చేసుకుందని, ఇప్పుడు న్యాయం చేయటానికి వారి కుటుంబమే లేదన్నారు. ఆత్మహత్యకు కారకులైన పోలీసులను సస్పెండ్ చేయడం కాదని వారికి కఠినమైన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో ఎన్నో జరుగుతున్నాయని ఇప్పటికైనా సీఎం జగన్ కళ్ళు తెరవాలన్నారు. అవినీతి రహిత పాలన అన్న జగన్ మాటలు ఏమయ్యాయని, ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని ప్రభుత్వానికి జనసేన తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కడప నగర అధ్యక్షుడు మాలే శివ, చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు తాజ్ షరీఫ్, నగర్ కార్యదర్శి గజ్జల సాయి, సురేష్ బాబు నాగరాజు సందీపు శేషు పాల్గొన్నారు.

ఈ వారంలో కొన్ని అనివార్య కారణాల వల్ల సాంకేతిక సమస్యలు వచ్చినందున ఈ వారం సంచికను 6 పేజీల నుంచి 5 పేజీలకు తగ్గించడం జరిగింది. అసౌకర్యానికి చింతిస్తున్నాము. - జనస్వరం న్యూస్

## విద్యార్థుల బాగోగులు పట్టించుకోరా? వైజాగ్ జనసేన నాయకులు



విశాఖపట్నం ( జనస్వరం ) : ఈ కరోనా మహమ్మారి పరిస్థితిలో, AP లోని చాలా పాఠశాలలు ఉన్నత తరగతుల కోసం తిరిగి ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం గురించి కనీసం పట్టించుకోనప్పటికీ, విద్యా సంవత్సరాన్ని వృథా చేయకూడదనుకున్నందున విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారు. ఈ పరిస్థితిలో విశాఖ పశ్చిమ నియోజకవర్గం జనసేన పార్టీ శ్రేణులు, మల్కాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కరోనా నుండి మనల్ని ఎలా రక్షించుకోవాలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ప్రారంభించి ఆపై విద్యార్థులకు మాస్క్‌లను పంపిణీ చేశారు. అలాగే నేటి బాలలే రేపటి పౌరులు అని చెప్తూ క్రమశిక్షణ అలవాట్లను అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఇండస్ట్రియల్ బెల్ట్ జనసేన పార్టీ నాయకులు శ్రీకాంత్, దర్మేంద్ర, మనోహర్, పరమేష్ మరియు రాధాకృష్ణ నిర్వహించారు.

## పుష్కరాలపేట అంగన్ వాడి సెంటర్ నందు జ్యోతి ప్రజ్వలన



రాజమండ్రి ( జనస్వరం ) : రాజమండ్రి పుష్కరాల సెక్టర్ నందు గల అంగన్ వాడి కేంద్రంలో సూపర్ వైజర్ కె. లీలా కుమారి ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన జరిగినది. అలాగే బాలల దినోత్సవ సందర్భంగా పిల్లలకు కరోనా పట్ల అవగాహన కల్పిస్తూ, విలువలు గురించి తెలియజేశారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులు అని సంబోధిస్తూ విద్యా వ్యవస్థ నందు అవగాహన కల్పించారు. బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలలో భాగంగా మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా బాలల హక్కుల గురించి, అత్యవసర సేవలు, చట్టబద్ధమైన పిల్లలను పెంచుకొను మొదలగు విషయాల గురించి తల్లిదండ్రులకు లీలాకుమారి గారు వివరించారు. ఈ కార్యక్రమానికి సామాజికవేత్త సిద్ధు సూర్యవంశ్ గారు స్వీట్స్ మరియు బిస్కెట్స్ ఇతర పదార్థాలను సమకూర్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జనస్వరం
అక్షరమే ఆయుధం
www. Janaswaram.com

## పాఠకులకు మనవి

జనస్వరం ఈ - వార్తాపత్రిక (వార సంచిక) నందు మీ గళమైన వాణిని వినిపించాలనుకుంటున్నారా? మీ నియోజకవర్గ ప్రాంతంలో జరిగిన సంఘటనలను మన వార్తాపత్రిక నందు పంచుకోవాలనుకుంటున్నారా? మీ సమస్యలను మా పత్రిక నందు విన్నవించుకోవాలని అనుకుంటున్నారా? మీ స్వరంతో ప్రజలకు మరింత చేరువ అవ్వాలంటే మాకు ఈ క్రింది వాటికి పంపించండి.

9642067900
janaswaramnews@gmail.com

జనస్వరం న్యూస్ వెబ్సైట్ మరియు వార్తాపత్రిక మరింత నాణ్యమైన వార్తాప్రపంచాన్ని మీ ముందుకు తీసుకురావడానికి మీ వంతు సహాయంగా ఆర్థికంగా చేదోడుగా నిలవాలని కోరుకుంటున్నాము.

Phonepe/Googlepay

UPI id : janaswaram@ybl